ఉత్కంఠ

గాజువాక ఎవరి సొంతం?
- గెలుపోటములపై నేతల్లో టెన్షన్
- మరికొద్ది గంటల్లో ఫలితాలు
- సర్వత్రా ఆసక్తి

గాజువాక: పారిశ్రామిక ముఖద్వారం గాజువాక నియోజకవర్గంలో గెలుపెవరిదన్న విషయం ఉత్కంఠగా మారింది. మరో కొద్ది గంటల్లో విజేత ఎవరన్నది తేలనున్న నేపథ్యంలో అటు అభ్యర్థుల్లో, ఇటు ఆయా పార్టీల కార్యకర్తల్లోనే కాక ప్రజల్లో సైతం ఈ విషయం చర్చనీయాంశమైంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థితో పాటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విషయంలో చోటుచేసుకున్న వివిధ పరిణామాల నేపథ్యంలో ఇక్కడి పోటీ ఆసక్తిని నెలకొల్పింది. 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ గాజువాక నియోజకవర్గంలో పోటీ వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే చోటుచేసుకుంది. బరిలోకి దిగిన అభ్యర్థులకు వచ్చిన ఓట్లు ఇప్పటికే ఈవీఎంలలో భద్రంగా ఉండగా, వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు గెలుపుపై ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అభ్యర్థిత్వాన్ని కాస్త ఆలస్యంగా ప్రకటించినప్పటికీ ఆయన తనకున్న శక్తినంతా ఉపయోగించి ప్రచారంలో దూసుకుపోయారు. ఆయన నిర్వహించిన ప్రచారంతో ప్రత్యర్థులకు గుబులు పుట్టించారు. దీంతోపాటు తన తండ్రి గుడివాడ గురునాథరావు, తాత అప్పన్న కూడా ఎమ్మెల్యేలుగా పని చేసిన చరిత్ర ఉంది. దీంతో గుడివాడ కుటుంబానికి గాజువాకలో పెద్ద ఎత్తున అభిమానులున్నారు. అమర్‌నాథ్ కూడా రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రిగా పని చేయడంతో ఆలస్యంగా బరిలోకి దిగినా ప్రజల్లోకి వేగంగా దూసుకుపోగలిగారు. మరోపక్క జగన్ మోహన్‌రెడ్డి ప్రభంజనం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నేపథ్యంలో గాజువాకలో కూడా ఇదే పరిస్థితి ఉండవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు.

టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ప్రభుత్వ వ్యతిరేక ఓటుపై ఆధారపడ్డట్టుగా పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఆయన గతంలో ఎమ్మెల్యేగా చేసినా తమ పార్టీ నాయకుల నుంచే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. కూటమి తరఫున గాజువాక టికెట్ తొలుత జనసేనకు ఇస్తారని విస్తృత ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. వివిధ పరిణామాల నేపథ్యంలో చివరికి పల్లాకు టికెట్ ఇచ్చినా ఆ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ప్రచారానికి సైతం దూరంగా ఉన్నారు. అయితే, ఆయన కూటమి మిత్రుల సహకారంపై, ప్రభుత్వ వ్యతిరేక ఓటుపై, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో తాను గతంలో చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షకు లభించిన మద్దతుపై ఆధారపడ్డట్టు తెలుస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులకు సంబంధించిన గెలుపోటములపై ఈ అంశాలు ప్రభావం చూపనున్న నేపథ్యంలో గాజువాక గెలుపు ఉత్కంఠకు దారి తీసిందని రాజకీయ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.


గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి


పల్లా శ్రీనివాసరావు, టీడీపీ అభ్యర్థి

సెంటిమెంట్‌పై చర్చలు

గాజువాకలో ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచినవారికి మరోసారి అవకాశం రావడంలేదనే సెంటిమెంట్‌పై తీవ్ర చర్చ నడుస్తోంది. ఈ సెంటిమెంట్ వర్కవుట్ అవుతుందో, లేదో మరికొద్ది గంటల్లో తేలనుంది. పల్లా శ్రీనివాసరావు విజయం సాధిస్తే గాజువాక ఎమ్మెల్యేగా రెండోసారి ఎన్నికైనట్టు అవుతుంది. అమర్‌నాథ్ గెలిస్తే గాజువాక ఎమ్మెల్యేగా తొలిసారి పని చేసే అవకాశం దక్కనుంది. కాగా, 2009లో గాజువాక ఎమ్మెల్యేగా గెలుపొందిన చింతలపూడి వెంకట్రామయ్య ఆ తరువాత పోటీ కూడా చేయలేదు. 2014లో ఎమ్మెల్యేగా గెలుపొందిన పల్లా శ్రీనివాసరావు 2019లో ఓటమిని చవిచూశారు. ఆ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన తిప్పల నాగిరెడ్డి ప్రస్తుత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. గుడివాడ అమర్‌నాథ్ ఎమ్మెల్యేగా అనకాపల్లిలో పని చేసినప్పటికీ గాజువాక నియోజకవర్గంలో మొదటిసారి పోటీ చేస్తున్నారు. ఒకసారి ఇక్కడ గెలిచిన వారికి రెండోసారి అవకాశం రావడం లేదనే సెంటిమెంట్ పని చేస్తే అమర్‌నాథ్‌కు అవకాశం లభిస్తుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ఇలా..

- నియోజకవర్గాల పునర్విభజన తరువాత తొలిసారిగా గాజువాక నియోజకవర్గానికి 2009లో ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ తరఫున చింతలపూడి వెంకట్రామయ్య, కాంగ్రెస్ తరఫున తిప్పల గురుమూర్తిరెడ్డి, సీపీఎం తరఫున సీహెచ్.నర్సింగరావు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా తిప్పల నాగిరెడ్డి బరిలో నిలిచారు. త్రిముఖ పోటీ నెలకొన్న ఆ ఎన్నికల్లో ప్రజారాజ్యం అభ్యర్థి చింతలపూడి వెంకట్రామయ్య 17,907 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- 2014లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తిప్పల నాగిరెడ్డి, ఎన్‌డీఏ కూటమి నుంచి టీడీపీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో పల్లా శ్రీనివాసరావు 21,659 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తిప్పల నాగిరెడ్డి, జనసేన పార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్, టీడీపీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో పవన్ కల్యాణ్‌పై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తిప్పల నాగిరెడ్డి 16,753 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎన్‌డీఏ కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఇండియా కూటమి తరఫున సీపీఎం అభ్యర్థిగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గనాయుడు పోటీలో నిలిచారు. ఎన్నికల సరళిని బట్టి చూస్తే ఇక్కడ అమర్‌నాథ్, పల్లా శ్రీనివాసరావు మధ్య పోటీ నెలకొంది. ఫలితం మరో కొద్ది గంటల్లో వెలువడనుంది.

మహిళా ఓటుపైనే అందరి దృష్టి

గాజువాక నుంచి 14 మంది ఎన్నికల బరిలో ఉండగా వైఎస్సార్‌సీపీ నుంచి గుడివాడ అమర్‌నాథ్, ఎన్‌డీఏ కూటమి నుంచి టీడీపీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు, ఇండియా కూటమి నుంచి సీపీఎం అభ్యర్థిగా ఎం.జగ్గనాయుడు పోటీలో ఉన్నారు. గత నెల 13న ఎన్నికల సందర్భంగా గాజువాక నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. మొత్తం 3,33,611 ఓటర్లకు గాను 2,32,949 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 69.83 శాతం పోలింగ్ నమోదైన గాజువాకలో పురుషులు 1,14,844 మంది, మహిళలు 1,18,105 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల కంటే మహిళలు 3261 మంది అధికంగా ఓట్లు వేశారు. మహిళా ఓట్లు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపులో కీలకంగా మారనున్నట్టు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ముందెన్నడు లేని విధంగా గాజువాకలో మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం తమకు లాభిస్తుందా, ప్రత్యర్థులకు ఉపయోగపడుతుందా అనే కోణంలో అభ్యర్థులు ఆలోచిస్తున్నారు. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరిగింది. అందులోను మహిళల ఓటింగ్ మరింత పెరిగింది. పురుషుల కంటే అధిక సంఖ్యలో మహిళా ఓట్లు పోలవడం ఎవరికి మేలు అన్న విషయంలో అభ్యర్థులు ఆలోచిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల కారణంగానే మహిళా ఓటింగ్ పెరిగినట్టు పలువురు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

వైభవంగా విజయరాఘవ స్వామి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో విజయరాఘవ స్వామి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలోని శ్రీ విజయరాఘవ స్వామి 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సీతా, లక్ష్మణ, ఆంజనేయ సహిత విజయరాఘవ స్వామికి సోమవారం విశేష పూజలు చేశారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని, స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ప్రారంభించారు. వేలసంఖ్యలో భక్తులు పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు.

గణిత సూత్రాలే ముఖ్యం


గణితంపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: సూత్రాలపై పూర్తి అవగాహన ఉంటే గణితం సులభంగా ఉంటుందని పెదగంట్యాడ గ్రంథాలయాధికారి పి.వి.రమణ అన్నారు. స్థానిక పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు స్థానిక ఉపాధ్యాయులు గణిత సూత్రాలపై శిక్షణ ఇచ్చారు. వాటిపై పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గణితం అంటే భయపడతారని, కానీ, టెక్నిక్ అర్థమైతే అన్నిటి కంటే సులభమైన సబ్జెక్ట్ గణితమేనని చెప్పారు. అనంతరం గణితంలోని సూత్రాలను విద్యార్థులకు అర్థం అయ్యే రీతిలో వివరించారు. కార్యక్రమంలో టీచర్లు లక్ష్మి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ అదృశ్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్‌ఎఫ్ యూనిట్‌కు చెందిన కానిస్టేబుల్ ఆర్.రాజేంద్రరావు (36) అదృశ్యమైన ఘటనపై స్టేషన్‌లో కేసు నమోదైంది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. విజయనగరం జిల్లా తెర్లాం మండలం వెలగవలసకు చెందిన రాజేంద్రరావు స్టీల్‌ప్లాంట్ యూనిట్‌లో పనిచేస్తూ అక్కడి బ్యారక్స్‌లో ఉంటున్నారు. రాజేంద్రరావు మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో బ్యారక్స్ నుంచి లుంగీతో బయటకు వెళ్లిన రాజేంద్ర తిరిగి బ్యారక్స్‌కు చేరలేదు. దీంతో సీఐఎస్‌ఎఫ్ ఎస్‌ఐ అందించిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ పాత్రుడు నాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిసిన వారు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు తెలియజేయాలని కోరుతున్నారు.

5న హాజరు కావాలి

ఉక్కు యాజమాన్యానికి ఆర్‌ఎల్‌సీ ఆదేశం

అగనంపూడి: ఉక్కు కార్మికుడు నాట్ర తాతారావుతో 29 సంవత్సరాలు పని చేయించుకుని, వచ్చిన జీతంలో నిబంధనల మేరకు పీఎఫ్ కోత విధించినా నెలవారి పింఛన్ చెల్లింపులో ఉక్కు యాజమాన్యం, పీఎఫ్ అధికారులు కప్పదాటుగా వ్యవహరిస్తున్న తీరుపై రీజనల్ లేబర్ కమిషనర్ ఈ నెల 5వ తేదీన హాజరు కావాలని ఉక్కు అధికారులను ఆదేశించారు. వాస్తవంగా ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేసిన కార్మికులకు 58 సంవత్సరాలు దాటిన తరువాత జాతీయ భద్రతా పెన్షన్ పథకంలో కనీస పింఛన్ చెల్లించాలి. అయితే ఈ విషయంలో ఉక్కు అధికారులు, ఈపీఎఫ్ అధికారుల ద్వంద్వ వైఖరిపై తాతారావు ఆర్‌ఎల్‌సీకి ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన 5న హాజరు కావాలని ఆదేశించారు. అలాగే దేవర అప్పలకొండ అనే వితంతువును ఆమె ఆధార్ కార్డు ఆధారంగా చేసుకుని విధుల నుంచి తొలగించడంపై కూడా ఉక్కు యాజమాన్యం హాజరు కావాలని ఆర్‌ఎల్‌సీ ఆదేశించింది.

రహదారులు జలమయం

వర్షంతో ప్రజలకు ఉపశమనం


చెరువును తలపిస్తున్న నడుపూరులోని క్రీడా మైదానం


వర్షానికి నీట మునిగిన వినాయకనగర్ ప్రధాన రహదారి

పెదగంట్యాడ: ఎండలతో ఠారెత్తిపోతున్న ప్రజలకు వర్షం ఉపశమనాన్ని ఇచ్చింది. వేసవిలో భానుడు నిప్పులు కురిపించాడు. రోహిణీ కార్తెలో సూరీడి ప్రతాపానికి జనం బయటకు రావడానికి కూడా సాహసించలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వెళ్లాలన్నా గొడుగులు, టోపీలు పెట్టుకుని వెళ్లేవారు. ఈ తరుణంలో ఆదివారం ఉదయం, రాత్రి కురిసిన వర్షంతో వాతావరణం కాస్త చల్లబడి అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే, వర్షానికి మండలంలో రహదారులు, క్రీడా మైదానాలు నీట మునిగాయి. వినాయక నగర్ ప్రధాన రహదారి వర్షం నీటితో నిండిపోయింది. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

కోక్‌ఓవెన్స్ మెకానికల్ ఇన్‌చార్జికి అభినందనలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ మెకానికల్ ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ జి.బి. శ్రీనివాస్‌ను కోక్‌ఓవెన్స్ మెకానికల్ ఉద్యోగులు అభినందించారు. మెకానికల్ ఇన్‌చార్జిగా శ్రీనివాస్ నియమితులైన సందర్భంగా వారు ఆయనను కలిసి, శాలువా కప్పి బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస్ కోక్‌ఓవెన్స్ విభాగంలో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరి అంచలంచెలుగా జనరల్ మేనేజర్ స్థాయిలో మెకానికల్ ఇన్‌చార్జిగా ఎదగడం అభినందనీయమన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విభాగం కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో కొమ్ము ప్రసాదరావు (ఇంటక్), తాండ్ర కనకరాజు (ఏఐటీయూసీ), ఆనంద్ కుమార్ (సిటూ), హనుమంతరావు, మజ్జి సూరిబాబు, అధికారులు బద్రీనాథ్, టి.సన్యాసిరావు, సిహెచ్. శ్రీనివాసరావు, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విభాగం ఇన్‌చార్జి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న నాయకులు

ఉక్కు ఆస్పత్రి హెచ్‌వోడీకి అభినందనలు


ఉక్కు ఆస్పత్రి విభాగాధిపతి నవీన్‌కుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎ.పి.నవీన్‌కుమార్‌ను స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు జనరల్ ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని విభాగాధిపతిని కోరారు. ఆస్పత్రిలో వైద్యుల నియామకం చేపట్టాలని, పారామెడికల్ సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ఎస్.ఎ.నాయుడు, బి.ఎస్.రాజు, బి.టి. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'జామ్'లో కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : ఐఐటీ–జామ్ (జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్)లో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంచి ర్యాంకులు సాధించి ఐఐటీ ఇండోర్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో రాజ్‌గిరి బంగారి, ఐఐటీ మద్రాస్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో ఎం.హేమలత సీట్లు దక్కించుకున్నారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. విజయబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ ఎ.వి.రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం

- స్టీల్ సీఐటీయూ పిలుపు
- 14న రక్తదాన శిబిరం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం చేద్దామని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. సీఎంఎస్ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం నిర్వహించిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2018 నుంచి స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ జూన్ 14న డాక్టర్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో జరిగే రక్తదానం కార్యక్రమంలో ప్రతీ కార్మికుడు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె.గంగాధర్, టి.వి.కె రాజు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్టీల్ సీఐటీయూ నాయకులు

రైల్వేస్టేషన్‌కు దారెటు?

తికమకకు గురి చేస్తున్న డిస్‌ప్లే బోర్డు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గమధ్యలో రాజీవ్‌నగర్ కూడలి వద్ద ప్రయాణికులు తికమకకు గురవుతున్నారు. రాజీవ్‌నగర్ కూడలిలోని ఫ్లైఓవర్ వంతెన వద్ద రైల్వే అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. అయితే ఒకటో ప్లాట్‌ఫాం వైపు వెళ్లాలంటే ఒక మార్గంలో.. నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం వైపు వెళ్లాలంటే మరో మార్గంలో వెళ్లాలి. రెండు మార్గాలకు ఒకే బోర్డుపై దారి సూచిస్తూ ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా వంతెనకు రెండువైపులా మార్గాలు ఉండడంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. వంతెనకు రెండు వైపులా ఉన్న రహదారులు కూడా ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌కే వెళ్తాయి. అదే వంతెనపై నుంచి వెళ్తే నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్‌కు చేరుకుంటాయి. బోర్డులో ఇవేవి స్పష్టంగా లేకపోవడంతో ప్రయాణికులు తికమకకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాట్‌ఫామ్‌లను స్పష్టంగా సూచిస్తూ రెండు బోర్డులు ఏర్పాటు చేయాలని, లేదా రెండు మార్గాలను స్పష్టంగా సూచిస్తూ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు.



రైల్వేస్టేషన్ మార్గం చూపించే బోర్డు ఇలా..

పర్యావరణ హితంగా జీవిద్దాం


పర్యావరణ పరిరక్షణపై వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మురళీనగర్: ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బాలభాను విద్యాలయంలో నగరంలోని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకో వైజాగ్ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపునకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై పూర్తి అవగాహన పెంచుకుని తమ తోటివారితోపాటు తల్లిదండ్రులకు దీని ప్రాధాన్యాన్ని తెలియజేయాలని కోరారు.

150 మంది విద్యార్థుల హాజరు

చిత్రలేఖనం పోటీల్లో 51 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శబ్ద, వాయు, జల కాలుష్యాల నివారణకు పౌరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ చిత్రాలు వేశారు. చిత్ర కళాకారుడు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ విశ్రాంత మేనేజర్ డబ్బీరు ఉదయ భాస్కరరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. రెండు విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులకు విద్యార్థులను ఎంపిక చేశారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ జనరల్ నాలెడ్జ్, పెద్ద బాలశిక్ష పుస్తకాలను వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సత్తి సునీల్‌రెడ్డి, సత్తి లలితారెడ్డి పంపిణీ చేశారు.

కూరగాయలు, ఆకుకూరల విత్తనాల పంపిణీ

విశిష్ట అతిథి గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పర్యావరణ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఎకో వైజాగ్‌లో భాగంగా కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలభాను విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ మనోరమణి, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాసరాజు, యూనివర్సల్ యూత్ వాకర్స్ అధ్యక్షుడు సిహెచ్.వంశీకృష్ణ వర్మ, మహిళా వాకర్స్ క్లబ్ కార్యదర్శి సిహెచ్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహ సందర్శన

మర్రిపాలెం: రాష్ట్రవ్యాప్తంగా చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ల(సీసీఐ) సందర్శనలో భాగంగా 53వ వార్డు మర్రిపాలెంలోని మహిళా శిశుగృహ కేంద్రం, మహిళా హాస్టల్‌ను సోమవారం స్కీమ్స్ జాయింట్ డైరెక్టర్ ఎ.విజయ సందర్శించారు. శిశుగృహ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, వారి సంరక్షణ కోసం ఆరా తీశారు. పలు దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో రమణకుమారి, నోడల్ అధికారి శ్రీకళ, డీసీపీవో లక్ష్మి, పీవో(ఎన్ఐసీ) మమత, మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ రామలక్ష్మి తదితర సిబ్బంది పాల్గొన్నారు.


ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో స్కీమ్స్ జాయింట్ డైరెక్టర్ విజయ

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

వెంకటాపురంలో ఫ్లాగ్ మార్చ్

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం నుంచి వెంకటాపురం వరకు వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యంలో సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గోపాలపట్నం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీసీపీ వెంకటరత్నం మాట్లాడుతూ కౌంటింగ్ జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు సామరస్యంగా మెలగాలని సూచించారు. నగరంలో 144 సెక్షన్ అమల్లో ఉందని ఎక్కువ మంది గుమిగూడకూడదని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని గోపాలపట్నం సీఐ సురేష్, ఎస్‌ఐలు అప్పలనాయుడు, రామకృష్ణ, పెందుర్తి సీఐ రామకృష్ణ ఎస్‌ఐలు, ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.


గోపాలపట్నం నుంచి వెంకటాపురం వరకు ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు

వేట సన్నాహాల్లో మత్స్యకారులు

ఎంవీపీ కాలనీ: వేట విరామం గడువు దగ్గరకు వస్తుండడంతో మత్స్యకారులు వేటకు సన్నాహాలు చేసుకుంటున్నారు. చేపల వేటకు అవసరమైన వలలను సిద్ధం చేసుకుంటున్నారు. కొద్ది రోజులుగా అప్పుఘర్, జాలరిపేటలో చాలా మంది మత్స్యకారులు ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఏటా వేట విరామం పాటిస్తుండడంతో రెండు నెలలుగా మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. ఈ నెల 15వ తేదీతో ఆ గడువు ముగియనుండడంతో చేపల వేటకు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేసుకునే పనిలో మత్స్యకార గ్రామాలు నిమగ్నమయ్యాయి. ఈ మేరకు 18, 19 వార్డుల్లో అప్పుఘర్, వాసవానిపాలెం, పెదజాలరిపేటలో ఎక్కడ చూసిన మత్స్యకారుల సన్నద్ధత దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. గుంపులు, గుంపులుగా మత్స్యకారులు వలలు బాగుచేసుకుంటుండటంతో పాటు బోట్లు, ఇంజిన్లను సరిచేసుకుంటూ వేటకు సిద్ధమవుతున్నారు.


అప్పుఘర్‌లో వలలను సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

నేత్రపర్వంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ఈసేవను స్వామికి జరిపించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవలను అధిష్ఠింపజేసి అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. లక్ష్మీకాంత్‌నాయక్ దంపతులు వింజామరతో స్వామికి సేవలందించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


స్వామి నిత్యకల్యాణంలో పాల్గొన్న లక్ష్మీకాంత్ నాయక్ దాస్